## క్లుప్తంగా

### జేడీఎస్‌లో చేరిక



జేడీఎస్‌లో చేరిన ముస్లింలు

పావగడ: పట్టణంలోని 16వ వార్డుకు చెందిన సుమారు వంద మంది ముస్లిం నాయకులు, మహిళలు జేడీఎస్ పార్టీలోకి చేరారు. బాబయ్య గుడి సంత మైదానంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తాలూకా మైనార్టీ విభాగం అధ్యక్షుడు యూనస్, బషీర్, సుహేల్ నేతృత్వంలో మాజీ ఎమ్మెల్యే, జేడీఎస్ అభ్యర్థి తిమ్మరాయప్ప సమక్షంలో వారు ఇతర పార్టీలను వదిలి జేడీఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా జేడీఎస్ పట్టణాధ్యక్షుడు గద్దం తిమ్మరాజు తదితరులు పాల్గొన్నారు.

### పని దినాలు పూర్తి చేసుకోండి

మడకశిరరూరల్: మండలంలో ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు ఉన్న కూలీలు ఈనెలాఖరులోపు వంద రోజుల పని దినాలను పూర్తి చేసుకోవాలని ఏపీఓ శ్రీకాంత్‌గౌడు తెలిపారు. కూలీలకు ఉపయోగపడే పనులను గ్రామ స్థాయిలో కల్పిస్తున్నామని కూలీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇప్పటి వరకు వంద రోజుల పని దినాలు పూర్తి చేసుకోని వారు రోజూ పనులకు వెళ్లాలని సూచించారు. పనుల చేసే చోట నీడ, తాగునీరు సౌకర్యాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

### క్రీడలతో మానసికోల్లాసం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

పావగడ: క్రీడలతో మానసికోల్లాసం కలగడంతో పాటు దేహ దారుఢ్యం పెరుగుతుందని శాంతి నగర్ కౌన్సిలర్ మహ్మద్ ఇమ్రాన్ అన్నారు. గెలుపోటములు సమానంగా తీసుకోవాలన్నారు. 17వ వార్డులో బుధవారం నిర్వహించిన శాంతినగర్ ప్రీమియం లీగ్ క్రికెట్ పోటీలను మహ్మద్ ఇమ్రాన్ ప్రారంభించారు. రెండు రోజులు జరిగే ఈ పోటీల్లో 5 జట్లు తల పడుతున్నాయి. ప్రథమ బహుమతి రూ 20 వేలు, ద్వితీయ బహుమతి రూ 15 వేలు అందిస్తారు. కార్యక్రమంలో మహ్మద్ ఫజులుల్లా, గుర్రప్ప, కౌన్సిలర్లు వేలు రాజు, నాగభూషణరెడ్డి, షా బాబు, రిజ్వాన్ తదితర వార్డు ప్రముఖులు పాల్గొన్నారు.

### నేడు జ్యోతుల ఉత్సవం

రొళ్ల: మండల పరిధిలోని దొడ్డేరి గ్రామ సమీపంలో వెలసిన పురాతన దొడ్డీరమ్మదేవి అమ్మవారికి గురువారం జ్యోతుల ఉత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతి ఏడాది ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని అమ్మవారికి జ్యోతుల ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఒక రోజు ముందే ఆలయాన్ని మామిడి తోరణాలు, పూలతో పాటు విద్యుత్ దీపాలతో అలంకరించారు. దొడ్డేరి, కొత్తపల్లి, పిల్లిగుండ్ల, రంగనపల్లి, వెంకటంపల్లి తదితర ప్రాంతాల్లో అమ్మవారిని కొలిచే భక్తులు అమ్మవారికి జ్యోతుల ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఉత్సవానికి హాజరు కానున్న భక్తులకు అన్నదానంతో పాటు తీర్థప్రసాదం అందిస్తామని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

### కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

రొళ్ల: మండల పరిధిలోని ఆవినకుంట దగ్గరున్న కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరంలో 6వ తరగతితో పాటు 7, 8వ తరగతులలో మిగిలిన సీట్ల భర్తీ కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్న కేజీబీవీ ఎస్‌ఓ మున్వార్‌జాన్ తెలిపారు. అనాథలు, బడిబయట పిల్లలు, బడిమానిన పిల్లలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ బాలికలు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఈనెల 27 నుంచి ఏప్రిల్ 20లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుందన్నారు.

### నేడు భగత్‌సింగ్ విగ్రహావిష్కరణ



ఆవిష్కరణకు సిద్ధంగా ఉన్న భగత్‌సింగ్ విగ్రహం

పెనుకొండ: పట్టణంలోని మిట్టాంజనేయ స్వామి కళ్యాణ మంటపంలో మిట్టాంజనేయ స్వామి టెంపుల్ డెవలప్‌మెంట్ సొసైటీ, శ్రీకృష్ణదేవరాయ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వాతంత్ర సమరయోధుడు భగత్‌సింగ్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాసులు తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలందరూ పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# సంబరంగా ఉగాది

- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
- బ్రహ్మరథోత్సవాలు, గ్రామోత్సవాలతో సందడి

సాక్షిబృందం: తెలుగు వారి తొలి పండగ ఉగాది పర్వదినాన్ని ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లో పండుగ నిర్వహించారు. ఉదయాన్నే అందరూ స్నానాలు ఆచరించి కొత్త బట్టలు ధరించి కుటుంబ సభ్యులతో కలిసి ఆలయాలకు వెళ్లి స్వామివార్లను దర్శించుకున్నారు. ఇండ్ల వాకిళ్లకు మామిడి ఆకుల, వేపాకులతో తోరణాలను కట్టి, ప్రత్యేకంగా పూలతో అలంకరణలు చేశారు. అలాగే తమ కుటుంబాల్లో చనిపోయిన పూర్వీకుల సమాధుల వద్దకు వెళ్లి కొబ్బరి కాయలను కొట్టి పూజించారు. చిన్నారులు, యువతులు సాంప్రదాయబద్ధమైన ఆటలు, పాటలతో సందడి చేశారు.

**సాహిత్యం సమాజానికి దర్పణం**

హిందూపురం టౌన్: సాహిత్యం సమాజానికి దర్పణం లాంటిదని, సమాజాభివృద్ధికి సాహిత్యం ఉపయోగపడాలని కవి, రచయిత సడ్లపల్లి చిదంబరెడ్డి అన్నారు. ఉగాదిని పురస్కరించుకుని బుధవారం రాత్రి స్థానిక అల్‌హిలాల్ పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఉగాది కవి సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. కవి సమ్మేళనంలో పలువురు కవులు, రచయితలు పాల్గొన్నారు. సాహిత్యం మానవీయ విలువలు పెంపొందించేలా ఉండాలన్నారు. పలువురి కవుల కవితలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జేవీవీ నాయకులు డాక్టర్ ఈటీ రామ్మూర్తి, రామకృష్ణ, జీఆర్ శ్రీనివాసులు, రచయిత, కవులు పెన్నయ్య, భాస్కర్‌రెడ్డి, దస్తగిరి, ఓబులేషు, దేశాయి రామప్ప, సూర్యనారాయణ, ఉమర్‌ఫారూక్ తదితరులు పాల్గొన్నారు.

**ఆకాశాన్ని తాకిన పూల ధరలు**

అమరాపురం: ఉగాది నేపథ్యంలో పూల ధరలు ఆకాశాన్ని తాకాయి. నాలుగు మూరల పసుపు చామంతి రూ.300, ఎరుపు రంగు చామంతి రూ.250, బంతి పూలు రూ.200, కాకడ పూలు రూ.300, కనకాంబరం రూ.200 ధరలు పలికాయి.



మడకశిర రూరల్: జమ్మానిపల్లిలో శ్రీ లక్ష్మీనిడి మామిడమ్మకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం





హిందూపురం: మాట్లాడుతున్న కవి, రచయిత సడ్లపల్లి చిదంబరెడ్డి



పెనుకొండ: కాశీవిశ్వేశ్వరాలయ ఆవరణలో పంచాంగ శ్రవణంలో పాల్గొన్న ప్రజలు



హిందూపురం టౌన్: పంచాంగ శ్రవణం చేస్తున్న వేద బ్రహ్మ రామమ్మూర్తిస్వామి



పరిగి: అలంకరణలో మోదా బైలాంజనేయస్వామి



అమరాపురం: అలంకరణలో హేమావతి సిద్ధేశ్వరస్వామి




చిలమత్తూరు: కల్లుకుంటలో ఉట్లమాను ఎక్కుతున్న యువకులు



చిలమత్తూరు: చౌడేశ్వరీదేవిని ఊరేగిస్తున్న దృశ్యం



పావగడ: ప్రత్యేక అలంకరణలో శీతలాంబదేవి



రొళ్ల: అలంకరణలో కొత్త పాళ్యం వెంకటేశ్వరస్వామి



లేపాక్షి: ముత్యాలమ్మను ఊరేగిస్తున్న దృశ్యం

## ‘పురం’లో శాంతి సమావేశం

హిందూపురం: పవిత్ర రంజాన్ పండుగ ఉపవాస దీక్షలను శాంతి, సహనం, సోదర భావంతో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని వన్‌టౌన్ సీఐ ఈరన్న కోరారు. బుధవారం రాత్రి వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ముస్లిం మత పెద్దలు, ముత్తవల్లీలు, నాయకులతో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గురువారం నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభం అవుతున్నాయని దీక్షలు శాంతియుతంగా ముగిసేలా అందరూ సహకారం అందించాలన్నారు. రాత్రి, తెల్లవారుజాము సమయాలలో ప్రార్థనలు ముగిసిన వెంటనే రోడ్లపై ఉండకుండా ఇంటికి వెళ్లాలన్నారు. అధిక సౌండ్‌తో ఇతరులను ఇబ్బంది పెట్టకూడదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జబీవుల్లా, జామియా మసీదు ముత్తవల్లి నూరుల్లా, లతీఫ్‌సెట్ తదితరులు పాల్గొన్నారు.



వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ముస్లిం పెద్దలతో సమావేశమైన సీఐ ఈరన్న

## నారాయణ కళాశాలపై చర్యలు తీసుకోండి

హిందూపురం టౌన్: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తున్న నారాయణ కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం సెలవు రోజు అయినప్పటికీ తరగతులు నిర్వహిస్తున్న నారాయణ జూనియర్ కళాశాల వద్ద వారు నిరసన తెలిపారు. నాయకులు మాట్లాడుతూ ఉగాది పండుగను పురస్కరించుకుని బుధవారం పాఠశాలలకు, కళాశాలలకు ప్రభుత్వం సెలవు ప్రకటించినా తమకు ఏదీ పట్టదన్నట్లు నారాయణ కళాశాల యాజమాన్యం వ్యవహరిస్తోందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తున్నా చర్యలు తీసుకోవడంలో విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలు ధనర్జనమే ధ్యేయంగా ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తున్నాయని విమర్శించారు. నారాయణ కళాశాల యాజమాన్యంపైన కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి చంద్రశేఖర్, నాయకులు నిహాల్, ఫర్దీన్, నవీన్, నాసిర్ తదితరులు డిమాండ్ చేశారు.



నారాయణ జూనియర్ కళాశాల వద్ద నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

## చెరువు కింద గ్రానైట్ వ్యర్థాలు

చిలమత్తూరు: చిలమత్తూరు చెరువు కింద కొందరు రహదారికి తమ భూములను లెవెల్ చేయించుకొనేందుకు మట్టి వాడకుండా గ్రానైట్ వ్యర్థాలు వాడుతున్నారు. దీంతో తమ పంట పొలాలకు ఇబ్బందిగా మారుతోందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి గ్రానైట్ వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ వేయనియ్యకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



టిప్పర్ ద్వారా గ్రానైట్ వ్యర్థాలను వేస్తున్న దృశ్యం

## జూదరుల అరెస్ట్

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని నక్కలగుట్ట సమీపంలో పేకాట ఆడుతున్న నలుగురిని పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.6 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

# భక్తుల కొంగు బంగారం.. కొటిపి చౌడేశ్వరీదేవి

- 24న అమ్మవారి బ్రహ్మ రథోత్సవం
- వేలాదిగా తరలిరానున్న భక్తులు
- ఏర్పాట్లు పూర్తిచేసిన ఆలయ కమిటీ సభ్యులు

హిందూపురం: హిందూపురం మండలం కొటిపి గ్రామంలో వెలసిన చౌడేశ్వరీదేవి అమ్మవారి బ్రహ్మ రథోత్సవాన్ని శుక్రవారం నిర్వహించనున్నారు. ప్రతి ఏడాది ఉగాది పండుగ సందర్భంగా చౌడేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, ప్రాకార ఉత్సవ కార్యక్రమాలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. మంగళ, శుక్రవారాల్లో బ్రహ్మ రథోత్సవం చేస్తుంటారు. ఈ క్రమంలో 24న శుక్రవారం వైభవంగా రథోత్సవం నిర్వహించనున్నారు. రథోత్సవానికి గ్రామస్తులే కాదు పరిసరా ప్రాంతాలు, వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిస్తుంటారు. ఈ నేపథ్యంలో ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

**500 ఏళ్ల కిందటి నుంచే పూజలు**

రాష్ట్ర సరిహద్దులోని కొటిపి గ్రామంలో గ్రామదేవతగా కొలువై మన రాష్ట్రంతో పాటు కర్ణాటక, ఇతర రాష్ట్రల నుంచి తరలివచ్చే భక్తుల పాలిట కొంగు బంగారమై కోరిక కోర్కెలు నెరవేర్చే అమ్మవారిగా చౌడేశ్వరీదేవి పూజలందుకుంటున్నారు. సుమారు 500 ఏళ్ల కిందట ఇక్కడి ప్రజలు గ్రామదేవతగా చౌడేశ్వరీదేవి ప్రతిష్టించి పూజలు చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. అమ్మవారు కోర్కెలు తీరుస్తారని, ఎలాంటి దుష్ట పీడలలైనా దూరం చూసే శక్తి స్వరూపినని భక్తులు చెబుతున్నారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ముఖ్యంగా అమావాస్య, పౌర్ణమి రోజుల్లో విశేషంగా పూజలు చేస్తారు.

**చెరువు గట్టుపై బలిదానం**

భక్తులు చౌడేశ్వరి అమ్మవారిని దర్శించుకున్న తర్వాత చీర, సారే గాజులతో వడిబియ్యంతో కానుకాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. అలాగే కోళ్ల, గొర్రెలను భక్తులు పెద్ద ఎత్తున బలిఇస్తారు. ఆలయం ఆవరణలోని చెరువు గట్టుపై బలిదానం చేసినప్పుడు రక్తం ధారలు భూమిలోనే ఇంకిపోతాయని, కనిపించవని భక్తులు చెబుతున్నారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో ప్రత్యేక పూజలు చేయడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు కుటుంబ సమేతంగా తరలివస్తుంటారు.

**ఎంతటి విలువైన చీరైనా సరే ముట్టరు**

ఆలయంలోని చౌడేశ్వరీదేవి అమ్మవారికి వడిబియ్యంతో విలువైన చీరలు మొదలు సాధారణ చీరల వరకు భక్తులు సమర్పిస్తుంటారు. ఒక్కసారి అమ్మవారికి సమర్పిస్తే దాన్ని తీసి చెరువు కట్టవద్ద చెట్టు వద్ద వేసేస్తారు. ఎంతటి విలువైన చీరైనా సరే ఎవరూ ముట్టరు. చీరలు చెరువు కట్ట వద్ద గుట్టలుగా పెరుకుపోతున్నాయే తప్ప ఎవరూ తీసుకుపోరు. ఇది వందలాది ఏళ్లనాటి నుంచి వస్తున్న ఆచారం. కొన్నేళ్ల క్రితం గ్రామస్తులు చీరలను విక్రయించాలని నిర్ణయించి వ్యాపారిని పిలిచి చీరలు ఇచ్చారు. అతను విలువైన చీరలన్నీ తీసుకెళ్లి గుట్టలు కట్టి మరుసటి రోజు వచ్చి తీసుకెళ్తనని చెప్పి గ్రామ పొలిమేర దాటగానే అస్వస్థతకు గురై కాలు కదపలేక పడిపోయాడట. వెంటనే గ్రామస్తులు అమ్మవారి మహిమ గుర్తించి వెంటనే చీరలను గుడికిచేర్చి పూజలు చేయడంతో వ్యాపారి ఆరోగ్యం కుదుటపడిందని భక్తులు చెబుతున్నారు. ఆదేరోజు రాత్రి వ్యాపారి కలలో అమ్మవారు కనిపించి తాను కట్టిన చీర ఎవరూ తీసుకెళ్లరాదని చెప్పడంతో ఉదయాన్నే వ్యాపారి గుడికి వచ్చి అమ్మవారి మహత్యాన్ని తెలియజేశారని అంటున్నారు. అప్పటి నుంచి చీరలు ముట్టడానికి ఎవరూ సహసించలేదని గ్రామస్తులు చెబుతారు.



కొటిపి చౌడేశ్వరీదేవి



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



అమ్మవారికి సమర్పించిన చీరలు చెరువు కట్టపై గుట్టలుగా వేసిన దృశ్యం

## ఆకట్టుకున్న ఎడ్ల బండ్ల ప్రదర్శన

సోమందేపల్లి: ఉగాది సందర్భంగా మండల కేంద్రమైన సోమందేపల్లిలోని బుధవారం ఎద్దుల బండ్ల ప్రదర్శన జరిగింది. ప్రతి ఏడాదిలాగానే ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని పాత ఊరు ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఎద్దుల బండ్లను ముస్తాబు చేసి ర్యాలీ నిర్వహించారు. ఉత్సవాన్ని తిలకించడానికి వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చారు. ఎలాంటి ఘటనలు జరుగకుండా ఎస్ఐ విజయ్ కుమార్ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఎద్దుల బండ్లను ఊరేగిస్తున్న దృశ్యం



ఉత్సవానికి హాజరైన ప్రజలు